క్లుప్తంగా

ముగిసిన గనిపోతురాజు జాతర

కపిలేశ్వరపురం: అంగర పోతురాజుగూడెంలో వేంచేసిన కూనాలమ్మ సమేత గనిపోతురాజు జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయ 3వ వార్షికోత్సవంలో భాగంగా పోతురాజుగూడెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జాతర నిర్వహించారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆడపడుచులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉట్రుమిల్లిలో ఎకరానికి 42 బస్తాల దిగుబడి



ఉట్రుమిల్లిలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: ఉట్రుమిల్లిలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ఎకరానికి 42 బస్తాల దిగుబడి వచ్చినట్టు మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని సీహెచ్ సుబ్బారావు అనే రైతు పొలంలో 25 చదవరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్వహించిన పంట కోత ప్రయోగంలో 21.150 గ్రాముల ధాన్యం రావడంతో ఎకరానికి 42 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ఆర్. హేమంత్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ పథకంతో రైతులకు మేలు



మండపేటలో రైతుకు యంత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2024–25 ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు అన్నారు. మండపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం పథకంలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు సబ్సిడీపై పవర్ టిల్లర్స్, రోటావేటర్స్, ట్రాక్టర్ ఉపకరణాలు, స్ప్రేయర్లు తదితర యంత్రాలను ఎమ్మెల్యే వేగుళ్ల చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నకిలీ జామీను పత్రాలపై కేసు

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బెయిల్ నిమిత్తం నకిలీ జామీను పత్రాలను సమర్పించిన సంఘటనపై ఆలమూరు పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన తాలి యేసురాజు, చొల్లా సునీల్ నిందితులిద్దరూ మండపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో గత ఏడాది నమోదైన కేసుకు సంబంధించి జామీను పత్రాలను సమర్పించారు. అయితే ఆ జామీను పత్రాలపై అనుమానం వచ్చిన జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ తన సిబ్బంది సహకారంతో విచారణ చేపట్టగా నకిలీ పత్రాలని తేలింది. నిందితులిద్దరికి తానెప్పుడూ జామీను పత్రాలను అందించ లేదని ఆ గ్రామ కార్యదర్శి కోర్టుకు తెలపడంతో నేరం రుజువైంది. దీంతో జడ్జి ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో కోర్టు సూపరింటెండెంట్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంవీఐకి దేశవ్యాప్తంగా ఉత్తమ ప్రతిభా అవార్డు

రావులపాలెం: స్థానిక మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాసుకు దేశ వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభా అవార్డు లభించినట్టు బుధవారం ఆయన తెలిపారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ మోటారు డిపార్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రహదారి భద్రతపై ఉత్తమ సేవలు అందించడంతోపాటు పలు కార్యక్రమాలు చేస్తున్న వారిని గుర్తించి ఉత్తమ ప్రతిభా అవార్డులను అందించిందన్నారు. దేశవాప్తంగా ఎనిమిది మందికి అందించగా వారిలో తనకు ఈ గౌరవం దక్కిందని శ్రీనివాసు తెలిపారు. 15ఏళ్లుగా సేవలు అందిస్తూ ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత, పాఠశాల బస్సులపై 20 స్టార్ ఫిలిమ్స్ తీసి సినిమా థియేటర్లో వేయడం, రోడ్డు భద్రతా క్లబ్‌లు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేయడంతో ఈ అవార్డు వచ్చిందన్నారు. అహ్మదాబాద్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఒక కార్యక్రమంలో అక్కడ పోలీస్ కమిషనర్ సఫిన్ హసిన్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్‌ను అధికారులు అభినందించారు.

ఆనందం పదింతలు

- టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ
- జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచిన మాచవరం విద్యార్థిని
- ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనల వెల్లువ



కాజులూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు



ద్రాక్షారామంలో పలివెల స్వాతిని అభినందిస్తున్న జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



లక్ష్మీరమ్య నందు (589)



పి. ప్రసన్న (576)



దవులూరి మేఘన, 595



తలాటం శ్రీ సూర్య భవిత, 593



తివారి ప్రియ 593



ఎ.ఈశ్వరి (571)



కె.జాహ్నవి (563)



దేగల వర్షిణి 588



తోలేటి శ్రావణి 588

రాయవరం: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 88.48 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 372 మంది బాలురు, 314 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా 318 మంది బాలురు, 289 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 85.48 శాతం కాగా, బాలుర ఉత్తీర్ణత శాతం 92.04గా ఉంది. మండలవ్యాపంగా 686 మంది పరీక్షకు హాజరు 489 మంది ఫస్ట్‌క్లాస్‌లో, 83 మంది సెకండ్ క్లాస్‌లో, 35 మంది థర్డ్ డివిజన్‌లో వెరసి మొత్తం 607 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 256 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి, 430 మంది ప్రభుత్వ జెడ్పీ పాఠశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి 256 మంది, జెడ్పీ పాఠశాలల నుంచి 351 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రభుత్వ పాఠశాలలు 81.63 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

జిల్లా స్థాయి ప్రతిభ కనబర్చిన మాచవరం విద్యార్థిని

మండలంలోని మాచవరం జెడ్పీ పాఠశాల విద్యార్థిని పసుపులేటి వెంకట లక్ష్మీరమ్య నందు 589 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చింది. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండలంలో రమ్య నందు మొదటి స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన రమ్య నందును పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మండలంలో టాపర్స్ వీరే

మండలంలో మాచవరం విద్యార్థిని లక్ష్మీరమ్య నందు 589 మార్కులతో జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలవగా, మండలంలోని వెదురుపాక జెడ్పీ పాఠశాల విద్యార్థి బోణం వెంకట భాస్కర శ్రీరామ్ 588 మార్కులు సాధించాడు.

కాజులూరు మండలంలో 84 శాతం ఉతీర్ణత

కాజులూరు: పదో తరగతి పరీక్షల్లో మండలంలో 11 స్కూళ్ల విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. పల్లిపాలెం, అయితపూడి జెడ్పీహైస్కూల్‌ల్లో నూరు శాతం ఉత్తీర్ణతను సాధించారు. తణుకువాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని వాసంశెట్టి చరణ్ దీప్తి 585/600 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. కాజులూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని వాసిరెడ్డి రామలక్ష్మి 582/600 మార్కులతో ద్వితీయ స్థానంలో ఉతీర్ణత సాధించిందన్నారు. విద్యార్థులకు పలువురు అధికారులు, నాయకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

రామచంద్రపురం మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం 81.63

రామచంద్రపురం రూరల్: ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు గత ఏడాదితో పోలిస్తే కొంత వెనుకబడ్డాయి. మండల విద్యాశాఖ అధికారి తాడి వీరరాఘవ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో 99 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 70 మంది ఉత్తీర్ణులయ్యారు. నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో 45 మందికి 27 మంది, వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో 78 మందికి 55 మంది, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 28 మందికి 16 మంది, వేగాయమ్మపేటలో 32 మందికి 20 మంది, ద్రాక్షారామలో 120 మందికి 89 మంది, బీసీ వెల్ఫేర్ గరల్స్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 28 మందికి 28 మంది, ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 72 మందికి 62 మంది ఉత్తీర్ణులయ్యారు.

ద్రాక్షారామ విద్యార్థికి ప్రథమ స్థానం

ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పలివెల స్వాతి 582 మార్కులతో రూరల్ మండలంలో ప్రథమ స్థానం సాధించింది. హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పీవీవీఎస్ఎస్ఎస్ సంజన 572 మార్కులతో ద్వితీయ స్థానం పొందింది. శ్రీ మహాత్మా జ్యోతీరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని కొరుప్రోలు రమ్య 573 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది.

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని చాకలిపేట మున్సిపల్ హైస్కూల్‌లో 70 మందికి 50 మంది, కొత్తూరు హైస్కూల్‌లో 35 మందికి 31 మంది, ఎ.సావరం హైస్కూల్‌లో 54 మందికి 41 మంది, పిల్లా వారి హైస్కూల్ 58 మందికి 38 మంది, రత్నంపేట హైస్కూల్‌లో 95 మందికి 76 మంది, రామచంద్రపురం జెడ్పీ హైస్కూల్‌లో 40 మందికి 33 మంది, శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు గవర్నమెంట్ హైస్కూల్‌లో 55 మందికి 26 మంది ఉత్తీర్ణులయ్యారు.

పట్టణంలో పిల్లా వారి హైస్కూల్ విద్యార్థి ప్రథమ స్థానం

పట్టణంలో పిల్లా వారి హైస్కూల్ విద్యార్థిని వెలగల లలితా అభినవ చంద్రహాస 589 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎ.సావరం గరల్స్ హైస్కూల్ విద్యార్థిని జె. శ్రీలక్ష్మి 582 మార్కులతో ద్వితీయ స్థానంలోను, జెడ్పీ గరల్స్ హైస్కూల్ విద్యార్థిని వి.దీప్తి 581 మార్కులతో తృతీయ స్థానంలోను నిలిచారు.

కపిలేశ్వరపురం మండలంలో 95.1 శాతం ఉత్తీర్ణత

కపిలేశ్వరపురం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కపిలేశ్వరపురం మండలం విద్యార్థులు 470కి 447 మంది ఉత్తీర్ణులు కావడంతో 95.1 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. మండలంలోని 8 జెడ్పీ, 3 ప్రైవేటు మొత్తం 11 ఉన్నత పాఠశాలలకు చెందిన 231 మంది బాలురు, 239 మంది బాలికలు వెరసి 470 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 447 మంది ఉత్తీర్ణులయ్యారు. 23 మంది పరీక్ష తప్పారు. వాటిలో ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలలకు గానూ 180 మంది బాలురు, 195 మంది బాలికలు మొత్తం 375 మంది పరీక్షలకు హాజరు కాగా 352 మంది ఉత్తీర్ణులయ్యారు. 93.9 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 23 మంది పరీక్ష తప్పారు. మూడు ప్రైవేటు పాఠశాలలకు గానూ 51 మంది బాలురు, 44 మంది బాలికలు మొత్తం 95 మంది ఉత్తీర్ణులయ్యారు. నూరు శాతం ఉత్తీర్ణత నమోదైంది. నూరు శాతం ఫలితాల్లో వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాల మొదటి స్థానంలోనూ, 82.1 శాతంతో టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల చివరి స్థానంలోనూ నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పేరాబత్తుల ప్రసన్న 576 మార్కులతో మండల ప్రథమ స్థానంలోనూ, అరవపల్లి ఈశ్వరి 571 మార్కులతో ద్వితీయ, కర్రి జాహ్నవి 563 మార్కులతో మండల తృతీయ స్థానంలోనూ నిలిచారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థికి 555, కపిలేశ్వరపురం విద్యార్థికి 553, కాలేరు విద్యార్థికి 552, వల్లూరు విద్యార్థికి 549, వాకతిప్ప విద్యార్థికి 546, నల్లూరు విద్యార్థికి 539, టేకి విద్యార్థికి 527 మార్కులు అత్యధికంగా దక్కాయి.

మండపేట మండలంలో 89.48 శాతం ఉత్తీర్ణత

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 89.48 శాతం, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 97.27 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మండలంలో 857 మంది బాలురు, 912 మంది బాలికలు మొత్తం 1,769 మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 1,325 మంది ప్రథమ స్థానంలోనూ, 197 మంది ద్వితీయ స్థానంలోనూ, 62 మంది తృతీయ స్థానంలోనూ మొత్తం 1,583 మంది ఉత్తీర్ణులయ్యారు. 112 మంది బాలురు, 74 మంది బాలికలు మొత్తం 186 మంది పరీక్ష తప్పారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 404 మంది బాలురు, 522 మంది బాలికలు మొత్తం 926 మంది పరీక్ష రాయగా వారిలో 310 మంది బాలురు, 453 మంది బాలికలు మొత్తం 763 మంది ఉత్తీర్ణులయ్యారు. 94 మంది బాలురు, 69 మంది బాలికలు మొత్తం 163 మంది పరీక్ష తప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 549 మంది ప్రథమ శ్రేణిలోనూ, 156 మంది ద్వితీయ, 59 మంది తృతీయ స్థానంలోనూ ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన 453 మంది బాలురు, 390 మంది బాలికలు, మొత్తం 843 మంది పరీక్షలు రాయగా వారిలో 435 మంది బాలురు, 385 మంది బాలికలు మొత్తం 820 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 18 మంది బాలురు, 5 మంది బాలికలు, మొత్తం 23 మంది విద్యార్థులు పరీక్ష తప్పారు. 776 మంది ప్రథమ శ్రేణిలోనూ, 41 మంది ద్వితీయ, ముగ్గురు తృతీయ శ్రేణిలోనూ ఉత్తీర్ణులయ్యారు.

పది ఫలితాల్లో నియోజకవర్గ స్థాయిలో సూర్య విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ చెందిన సూర్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. రచి నియోజకవర్గ స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. మండలంలోని తోటపేటకు చెందిన దవులూరి మేఘన 595 మార్కులు, వెలంపాలెంకు చెందిన తలాటం శ్రీ సూర్య భవిత 593 మార్కులు, తాటిపల్లి గ్రామానికి చెందిన తివారి ప్రియ 593 మార్కులతో ద్వితీయ స్థానం, అదేవిధంగా అన్నాయిపేట గ్రామానికి చెందిన తోలేటి శ్రావణి 588 మార్కులు, తోటపేటకు చెందిన దేగల వర్షిణి 588 మార్కులతో తృతీయ స్థానంలోను నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ దొడ్డా శ్రీనివాసకుమారి తెలిపారు. తమ పాఠశాల గడచిన 6 సంవత్సరాలుగా నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తుందన్నారు. ఈ ఏడాది 141 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 141 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో 99 మంది 500 పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం దొడ్డా సత్తిబాబు, కైరం తాతాజీ, పెన్నాడ బుచ్చిరాజు, దొడ్డా మణిస్వరూప్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

‘సాక్షి’ కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

కపిలేశ్వరపురం: సాక్షి మీడియా కార్యాలయంపై కొందరు దాడి చేయడం అప్రజాస్వామికం అని మండల విలేకరుల సమాఖ్య నాయకులు అన్నారు. ఏలూరు జిల్లా సాక్షి మీడియా కార్యాలయంపై మంగళవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు, అతని అనుచరులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడికి వ్యతిరేకంగా కపిలేశ్వరపురం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం విలేకరులు నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జానకిరామయ్యకు వినతి పత్రం అందజేశారు. నాయకులు కోశెట్టి దేవసహాయం, పెద్దింశెట్టి లెనిన్ బాబు, చిట్టికుమార్, శేఖర్ మాట్లాడుతూ సాక్షి కార్యాలయంపై దాడి చేసి కంప్యూటర్లు ధ్వంసం చేయడమే కాక, విధి నిర్వహణలో ఉన్న రిపోర్టర్‌పై దాడి చేయడం నేరమన్నారు. ఏదైనా పత్రికలో వ్యతిరేక వార్త ప్రచురితమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో తమ అభ్యంతరాలను వ్యక్తం చేయవచ్చన్నారు.



కపిలేశ్వరపురంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

దానికి భిన్నంగా మీడియా కార్యాలయం, విలేకరులపై దాడులకు పాల్పడడం చట్ట రీత్యా నేరమన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, పత్రికా కార్యాలయాలపై మరోసారి దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విలేకరులు కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కాజులూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ప్రజలలో అపోహలు తొలగించి ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు.

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వివిధ శాఖలలోని ప్రభుత్వ ఉద్యోగులకు, స్థానికులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జే రాంబాబు, బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దూడల శంకరనారాయణ, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, చవ్వాకుల నారాయణమూర్తి, బోండా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కాజులూరులో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ఆలమూరు: మండలంలో నున్న ఆలమూరు, చొప్పెల్ల సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం గురువారం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఈ వేదికను మండల ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈసమస్యల పరిష్కార వేదికలో విద్యుత్ సాంకేతిక మండలి సభ్యులు సురేఖరాణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబా, ఫైనాన్స్ సభ్యులు ఎస్.సుబ్బారావు, స్వాతంత్ర్య సభ్యులు ఎస్.మురళీకృష్ణ పాల్గొని విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

ఇక ఆటా పాటే..

- నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు
- చివరి రోజు విద్యార్థుల కేరింతలు
- 49 రోజుల పాటు చిన్నారులకు హాలీడేస్



రాయవరంలో సెలవులు ఇచ్చిన ఆనందంతో ఉత్సాహంగా ఇంటి బాట పట్టిన విద్యార్థులు

రాయవరం: ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీపడ్డ విద్యార్థులు ఇక చదువులకు టాటా చెప్పి ఆటాపాటలతో నిమగ్నం కానున్నారు. పాఠశాల తరగతి గదుల్లో గడిపిన చిన్నారులకు వేసవి సెలవుల రూపంలో ఆటవిడుపు దొరికింది. విద్యా సంవత్సరమంతా తరగతులు, హోంవర్కులు, ట్యూషన్లు, పరీక్షలతో సతమతమైన విద్యార్థులు ఇక ఆహ్లాదాన్ని పొందనున్నారు. బుధవారం విద్యా సంవత్సరం చివరి రోజు కావడంతో పాఠశాలలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు వార్షిక ఫలితాలను ప్రకటించి, విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పలు చోట్ల ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి, విద్యార్థుల ప్రగతిపై చర్చించారు. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడంతో అటు పుస్తకాల బరువు..ఇటు ఎండ వేడిమి నుంచి వీరికి ఉపశమనం లభించింది. చదువుతో పాఠశాలల్లో, హోమ్ వర్క్‌లతో ఇంట్లో బిజీగా ఉండే పిల్లలకు ఒక్కసారిగా తీరిక సమయం దొరికింది. ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. బుధవారం పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో యథావిధిగా పనిచేశాయి. పాఠశాల విడిచిన అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా ఇంటి బాట పట్టారు. సెలవుల్లో ఏం చేయాలో..ఎక్కడెక్కడికి వెళ్లాలో అంచనాలు వేసుకుంటూ, స్నేహితులతో ఉల్లాసంగా చెప్పుకుంటూ ముందుకు సాగారు.

49 రోజుల పాటు సెలవులు

పాఠశాలకు జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ఉంటాయని డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. ఈ సెలవుల్లో తల్లిదండ్రులు తమ చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3, ఎఫ్ఏ-4, ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షల ఫలితాలకు సంబంధించి ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు.

ఆటల్లో మునిగి తేలనున్న విద్యార్థులు

ముగిసిన విద్యా సంవత్సరంలో పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇక ఆటపాటల్లో మునిగి తేలనున్నారు. మైదానాలు, పొలంగట్లపైన ఆటలు, నదులు, చెరువులు, కాలువల్లో ఈతలు కొట్టడంలో తలమునకలు కానున్నారు. రోజంతా ఇంచుమించుగా ఉత్సాహంతో గడపనున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ సామాన్లు సర్దుకొని స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్టాండులకు బయల్దేరారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు

పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో జిల్లాలోని ఆయా గురుకులాలు, వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలలకు వచ్చి వారిని తీసుకెళ్లారు.

కోచింగ్ సెంటర్ల వైపు పరుగులు

ఈ వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదైనా కోర్సు నేర్పించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో భాగంగా కంప్యూటర్ శిక్షణ, స్విమ్మింగ్, క్రికెట్, భరతనాట్యం, కూచిపూడి, చదరంగం తదితర అంశాల్లో శిక్షణ కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి సిలబస్‌ను వేసవి సెలవుల్లో బోధించేందుకు కొన్ని చోట్ల ట్యూషన్ సెంటర్లు వెలిశాయి. మరి కొంతమంది చిన్నారులు కాలక్షేపం కోసం అమ్మమ్మ, నాన్నమ్మ ఊళ్లతో పాటు సొంతూర్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కింద 2,318 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 2.11 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ నేటి నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు పట్టరాని సంతోషంతో పాఠశాల వద్ద విద్యార్థులు కేరింతలు కొట్టుకుంటూ టాటా.. బైబై అనుకుంటూ ఇంటిదారి పట్టడం కన్పించింది. పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పలు పాఠశాలల్లో చివరి పనిదినం రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీటు, హాట్‌తో పాటు చల్లని పానీయాలు అందజేశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ద్రాక్షారామలో కొవ్వొత్తుల ర్యాలీ



రామచంద్రపురం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ

రామచంద్రపురం రూరల్/రామచంద్రపురం: పెహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ అమరులైన యాత్రికులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మండలంలోని ద్రాక్షారామలో సీనియర్ న్యాయవాది మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలోను, రామచంద్రపురం పట్టణంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలోను కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

కార్యక్రమంలో నాయకులు దూడల శంకరనారాయణ, చిక్కాల దొరబాబు, అంకం శ్రీనివాస్, ముప్పనపల్లి గణేష్, ఆళ్ల బుజ్జి, అల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పి.గన్నవరం: స్థానిక తన కార్యాలయం వద్ద తహసీల్దార్ పి.శ్రీపల్లవి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యన్నపు డాంగే, వీఆర్వోలు పి.నర్సింహరావు, కోరుకొండ శ్రీనివాస్, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.